ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



రంజాన్ వేళలు — ఇఫ్తార్ (మంగళ) సా.6.26 — సహారి (బుధ) ఉ.4.28

ఏపీఈఏపీసెట్-2024కు 3,05,754 దరఖాస్తులు

- ఏపీఈఏపీసెట్ చైర్మన్, జేఎన్టీయూకే వీసీ జీవీఆర్ ప్రసాదరాజు

నిగ్గదీస్తున్నారు!



- నియోజకవర్గాల్లో బిక్కుబిక్కుమంటూ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థుల ఎన్నికల ప్రచారం
- గ్రామాల్లో ఏమూల నుంచి ఎవరు నిలదీస్తారోనని గుబులుతో ఆందోళనగా ప్రచారం
- ఐదేళ్లలో జగన్ సర్కారు ఏ పనీ చేయకపోవడంతో వైసీపీపై ఆగ్రహంగా జనం
- రహదారులు, ఇళ్లస్థలాలు ఇవ్వకపోవడం, పన్నుల బాదుడు, ఛార్జీల మోతపై నిలదీత
- ఇప్పటికే కాకినాడ సిటీలో ఎమ్మెల్యే ద్వారంపూడికి చుక్కలు చూపించిన మత్స్యకారులు
- కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కన్నబాబు ఎన్నికల ప్రచారాన్ని అడ్డుకున్న గ్రామస్థులు
- పింఛన్లు, అమలుకాని హామీలపై పిఠాపురంలో ఎంపీ గీతను నిలదీసిన మహిళలు
- గతుకుల రోడ్లపై ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపులకు జనం నిలదీత
- తన డ్రైవర్ హత్య కేసులో జైలుకెళ్లి వచ్చిన అనంతబాబును తరిమికొట్టిన దళితులు
- తుని, జగ్గంపేటలో భయంతో తమకు బదులు తనయులను పంపుతున్న అభ్యర్థులు

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి వెళ్తోన్న వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థులకు నియోజకవర్గాల్లో చుక్కలు కనిపిస్తున్నాయి. ఎక్కడికక్కడ సమస్యలపై జనం నిలదీస్తుండడంతో అభ్యర్థులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. గ్రామాల్లో ప్రచారంలో ఉండగా ఏమూలనుంచి ఎవరు వచ్చి ఏం సమస్యలపై కడిగేస్తారేమోననే ఆందోళనకు గురవుతున్నారు. దీంతో బిక్కుబిక్కుమంటున్నారు. ఇంతకుముందు గడపగడపలో జనం ఎమ్మెల్యేలను తరిమికొట్టారు. ప్రభుత్వంలో ఉండడంతో అధికారులు, పోలీసులను అడ్డంపెట్టుకుని బయట పడేవారు. కానీ ఇప్పుడు ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఒంటరిగా ప్రచారానికి వెళ్లాల్సి రావడంతో నిలదీతలు ఎదుర్కోలేక తలపట్టుకుంటున్నారు. ఇటీవల ఎన్నికల ప్రచారానికి వెళ్లిన కాకినాడసిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి దగ్గరనుంచి కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కన్నబాబు వరకు వీరిని జనం కడిగిపారేశారు. సమస్యలపై కారాలు, మిరియాలు నూరుతూనే ప్రచారాన్ని అడ్డుకున్నారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపులను గ్రామస్తులు నిలదీశారు. ఈ నియోజకవర్గంలో అభ్యర్థి తరఫున ఎన్నికల వ్యవహారాలను చక్కబెడుతున్న ఎమ్మెల్సీ అనంతబాబును అయితే జనం తరిమికొట్టారు. తనవద్ద పనిచేసే డ్రైవర్ హత్యకేసులో జైలుకు వెళ్లి వచ్చిన అనంతబాబు యథేచ్ఛగా నియోజకవర్గంలో తిరుగుతుండడంతో తిరగబడ్డారు. పిఠాపురం అభ్యర్థి వంగా గీతను రెండుచోట్ల జనం అడ్డుకున్నారు. జగ్గంపేట, పెద్దాపురం, తుని అభ్యర్థులు భయంతో తమకు బదులు తనయులను పంపుతున్నారు.

ఫ్చ్.. ఇవేం నిలదీతలో..

అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడ్డంతో జిల్లావ్యాప్తంగా నియోజకవర్గాల్లో టీడీపీ కూటమి, వైసీపీల అభ్యర్థులు ఎన్నికల ప్రచారంలో వేగం పెంచారు. ఉదయం వేళల్లో సమావేశాలు, చర్చలు, సాయంత్రం నుంచి రాత్రి వరకు ఇంటింటా ప్రచారాలు చేపడుతున్నారు. టీడీపీ, జనసేన కూటమి అభ్యర్థులు బీజేపీ శ్రేణులతో కలిసికట్టుగా ప్రచారంలో దూకుడుగా కదులుతున్నారు. తమ కూటమి అధికారంలోకి వచ్చే అమలు చేయబోయే సంక్షేమం గురించి వివరిస్తూ ఓటర్లను ఆకట్టుకుంటున్నారు. అదే సమయంలో అధికార వైసీపీ ఈ ఐదేళ్లలో గ్రామాలకు చేసిందేంలేదంటూ ఆ పార్టీ అక్రమాలు, అరాచకాలను ప్రజల ముందు ఉంచుతున్నారు. తద్వారా ఎక్కడికక్కడ నియోజకవర్గాల్లో దూసుకువెళ్తున్నారు. కానీ దీనికి విరుద్ధంగా జిల్లాలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థుల పరిస్థితి నెలకొంది. ప్రచారంలో భాగంగా ఎక్కడికి వెళ్లినా వీరిని ప్రజలు నిలదీస్తున్నారు. సమస్యలను ఏకరువు పెడుతూ ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. ప్రధానంగా సంక్షేమ పథకాల్లో కోత, ఇళ్ల స్థలాలు ఇచ్చినా పట్టాలు ఇవ్వకపోవడం, లేఅవుట్ స్థలాలు బాగోకపోవడం, విద్యుత్‌ఛార్జీల వాతలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇచ్చిన హామీలు ఈ ఐదేళ్లలో అమలు చేయకపోవడాన్ని ప్రశ్నిస్తున్నారు. ఇన్నేళ్లలో ఒక్కసారి కూడా తమ గ్రామానికి వచ్చి బాగోగులు పట్టించుకోలేదని, ఇప్పుడు ఓట్ల కోసం వస్తారా అంటూ దుమ్మెత్తిపోస్తున్నారు. దీంతో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు విలవిల్లాడుతున్నారు. వాస్తవానికి ఎన్నికల దృష్టితో గతేడాది అధికారులు, పోలీసులను అడ్డంపెట్టుకుని వైసీపీ ఎమ్మెల్యేలు గడపగడప పేరుతో గ్రామాల్లో తిరిగారు. సమస్యలపై నిలదీసిన జనం నోరు నొక్కేశారు. కానీ ఇప్పుడు ఎన్నికల కోడ్ రావడంతో వెంట అధికారులు, పోలీసులు లేకపోవడంతో సదరు వైసీపీ ఎమ్మెల్యేలు గుబులు చెందుతున్నారు. జనం నిరసనలు, నిలదీతలకు భయపడి, సమాధానం చెప్పలేక ప్రచారం నుంచి జారుకుంటున్నారు. కాకినాడసిటీ వైసీపీ ఎమ్మెల్యే ద్వారంపూడి ఇటీవల ఏటిమొగలో ఎన్నికల ప్రచారానికి వెళ్లగా మత్స్యకార మహిళలు తిరగబడ్డారు. ఇన్నాళ్లకు మేం గుర్తుకు వచ్చామా అంటూ కడిగిపారేశారు. చెత్తపన్ను వసూలు చేస్తారా అంటూ గుడ్లురిమారు. ఏం సమాధానం చెప్పలేక ఎమ్మెల్యే బిక్కముఖం వేశారు. ఆ వెంటనే మరో మహిళ ఎమ్మెల్యేకు కూర్చోని సమాధానం చెప్పింది. నిల్చొని ఎమ్మెల్యేకు సమాధానం చెప్పాలని ఆయన అను చరులు బెదిరించినా ఖాతరు చేయలేదు. కాకినాడ రూరల్ నేమాంలో ఎమ్మెల్యే కన్నబాబుపై మత్స్యకారులు తిరగబడ్డారు. ఆయన ప్రచారాన్ని అడ్డుకున్నారు. గ్రామానికి రావద్దని ఝలక్ ఇచ్చారు. గ్రామంలో చేపల చెరువులను బయటి వ్యక్తులకు లీజుకెలా ఇస్తారని నిలదీశారు. పిఠాపురం అభ్యర్థి వంగా గీతపై జనం తిరగబడ్డారు. యు.కొత్తపల్లి, గొల్లప్రోలులో ప్రచారానికి వెళ్లిన ఆమెను మహిళలు అడ్డుకున్నారు. ఎన్నేళ్ల నుంచి పింఛన్లు, ఇంటి స్థలాలు అడుగుతున్నా పట్టించుకోలేదని మండిపడ్డారు. తాళ్లరేవులో ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌ను ఇళ్లస్థలాల విషయమై మహిళలు రెండురోజులు అడ్డుకుని నిరసన తెలిపారు.



కాకినాడ ఏటిమొగలో ఎమ్మెల్యే ద్వారంపూడిని నిలదీస్తున్న మత్స్యకార మహిళలు

కొట్టినంత పనిచేశారు..

ప్రత్తిపాడు నియోజకవర్గంలో వైసీపీపై ప్రజలు ఏకంగా తిరగబడుతున్న పరిస్థితి నెలకొంది. ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు గ్రామాల్లో పర్యటనకు వెళ్తుంటే జనం రకరకాల ప్రశ్నలతో ఆయన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తూ నిలదీస్తున్నారు. రహదారుల అధ్వాన్న దుస్థితిపై మండిపడుతున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యే పర్వత ప్రసాద్ గ్రామాలకు ఏం చేయలేదని, ఇప్పుడు మీరువచ్చి ఓట్లు ఎలా అడుగుతారంటూ ఇటీవల పలుచోట్ల ఆయన్ను అడ్డుకుని నిలదీశారు. మరోపక్క వరుపుల తరఫున నియోజకవర్గంలోనే మకాం వేసి ఎన్నికల వ్యవహారాలను అన్నీ తానై చక్కబెడుతున్న ఎమ్మెల్సీ అనంతబాబు తీరుపై ఏకంగా పార్టీ కార్యకర్తలతో పాటు జనం తిరగబడుతున్నారు. వరుపుల డమ్మీని చేసి చక్రం తిప్పుతుండడంపై వారంతా మండిపడుతున్నారు. ప్రత్తిపాడు మండలం ధర్మవరంలో ఇటీవల ఓ రోజు రాత్రి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి వెళ్లిపోతున్న అనంతబాబును చూసి జనం తరిమికొట్టారు. తనవద్ద డ్రైవర్‌గా పనిచేసిన దళిత యువకుడిని హత్య చేసిన కేసులో జైలుకు వెళ్లి వచ్చిన అనంతబాబు దళిత ద్రోహి అంటూ తరిమారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అపవిత్రం చేశారంటూ దండలు తొలగించి పాలాభిషేకం చేశారు. మళ్లీ తమ గ్రామానికి రావద్దంటూ కొట్టినంత పనిచేశారు. దీంతో కారు వదిలేసి బైక్ ఎక్కి అనంతబాబు పారిపోయాడు. ఆ తర్వాత కొన్ని రోజులుగా ఆయన నియోజకవర్గంలో కనిపించకుండా రంపచోడవరం నియోజకవర్గానికి పారిపోయి అక్కడ ప్రచారం నిర్వహిస్తున్నారు. తీరా అక్కడా గిరిజనులు అనంతబాబుపై తిరగబడ్డారు. పెద్దాపురం, జగ్గంపేట, తుని నియోజకవర్గాల్లోను వైసీపీ అభ్యర్థులకు నిలదీతల భయం వెన్నాడుతోంది. గ్రామాల్లో ప్రచారానికి వెళ్తే సమస్యలపై ఎక్కడ జనం చుట్టుముడతారోనంటూ బిక్కుబిక్కుమంటున్నారు. నిలదీసిన వీడియోలు, ఫొటోలు బయటకు వస్తే నియోజకవర్గం అంతా డ్యామేజీ అవుతోందని ఆందోళన చెందుతున్నారు. దీంతో తమ బదులు ఎక్కువగా తమ వారసులను ప్రచారాలకు పంపుతుండడం విశేషం. జగ్గంపేటలో తోట నరసింహం తనయుడు, తునిలో మంత్రి రాజా తనయుడు ఇలా తండ్రులను కొంత పక్కన పెట్టి తామే ప్రచారం చేస్తున్నారు. తద్వారా ఎంతో కొంత నిరసనలు, నిలదీతల ముప్పు తప్పుతుందని సదరు నేతలు అంచనా వేస్తున్నారు.



ధర్మవరంలో బైక్ ఎక్కి పారిపోతున్న వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు

నేడు పవన్‌కల్యాణ్ రాక

- గొల్లప్రోలు మండలం చేబ్రోలులో ఉగాది వేడుకల్లో పాల్గొననున్న జనసేనాని
- ముస్తాబవుతున్న నివాసగృహం.. నేడు నూతన గృహప్రవేశం

పిఠాపురంలో పవన్‌కల్యాణ్‌ను గెలిపించండి

- ఆయన్ను శాసనసభకు పంపాల్సిన బాధ్యత పిఠాపురం ప్రజలదే
- మాజీ ఎంపీ హరిరామజోగయ్య లేఖ

పాలకొల్లు, ఏప్రిల్ 8: పిఠాపురంలో పవన్‌కల్యాణ్‌ను గెలిపించాలని కాపు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు మాజీ ఎంపీ చేగొండి హరిరామ జోగయ్య పిలుపునిచ్చారు.పవన్‌కల్యాణ్‌ను శాసన సభకు పంపాల్సిన బాధ్యత పిఠాపురం ఓటర్లదేనన్నారు. ఈ మేరకు పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో ఆయన బహిరంగ లేఖ రాసి సోమవారం పత్రికలకు విడుదల చేశారు. ఏళ్ల తరబడి కాపు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కులస్థులందరూ ఆర్థికంగాను, సామాజికంగాను వెనుకబడి ఉండి అగ్రకులాల వారికి ఊడిగం చేస్తూ బతుకులు భారంగా ఈడ్చూతూ కాలం గడుపుతున్నారన్నారు. దీనికి కారణం ఆర్థికంగా,రాజకీయంగా వెనుకబడి ఉండడమేనని లేఖలో పేర్కొన్నారు. జనాభా ప్రాతిపదికన యాచించే స్థాయినుంచి శాసించేస్థాయికి వీరు చేరుకోవాలన్నారు. బడుగు బలహీనవర్గాలకు చెందిన పవన్‌కల్యాణ్ అంచెలంచెలుగా రాజ్యాధికారం చేపట్టే దిశగా ముందుకు దూసుకొస్తున్నారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. పవన్‌కళ్యాణ్ రాజ్యాధికారం చేపడితే కాపు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కులాల అభివృద్ధి బాగుంటుందన్నారు. పవన్‌కల్యాణ్ శాసనసభ్యుడిగా పంపడం మీవంతైతే ఆయన మీ గౌరవానికి తగ్గకుండా కూటమిలో తగిన పదవితో దర్శనమిస్తారని, దీనికి పిఠాపురం ప్రజలు గర్వించదగ్గ పౌరులవుతారని పేర్కొన్నారు.

ఆకట్టుకున్న 'సంఘం శరణం గచ్ఛామి'

- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్రపై నృత్య రూపక నాటకం



కాకినాడ సూర్యకళామందిరంలో సంఘం శరణం గచ్ఛామి నాటక ప్రదర్శనలోని దృశ్యం

పోర్టుసిటీ(కాకినాడ), ఏప్రిల్ 8: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్రపై రూపొందించిన సంఘం శరణం గచ్ఛామి నృత్య రూపక నాటకం ఆకట్టుకుంది. కాకినాడ సూర్యకళామందిరంలో ప్రజాసంఘాలు ఆధ్వర్యంలో సోమవారం రాత్రి ప్రదర్శన జరిగింది. హైదరాబాద్ అభ్యుదయ ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో రూపొందించిన నాటకం అందరినీ ఆలోచింపచేసింది. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి అయితాబత్తుల రామేశ్వరరావు, డాక్టర్ చెలికాని స్టాలిన్, గోపినాథ్‌తోపాటు జి.బేబీరాణి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు యూటీఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి జి.ప్రభాకరవర్మ అధ్యక్షులుగా వ్యవహరించగా పలివెల వీరబాబు స్వాగతం పలికారు. అనంతరం కూర్మయ్య రాసిన అంబేడ్కర్ ఆలోచనలు పుస్తకాన్ని అతిథులు ఆవిష్కరణ చేశారు. మలక వెంకటరమణ, కె.సత్తిరాజు, టి.అన్నారామ్, వీవీ రమణతోపాటు యూటీఎఫ్, జేవీవీ, కేవీపీఎస్, ఎస్ఎఫ్ఐ, ఐద్వా, డీవైఎఫ్ఐ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

జిల్లాలో ఘనంగా నూకాలమ్మ జాతర

- అమ్మవారికి ప్రత్యేక పూజలు
- ఆకట్టుకున్న విచిత్ర వేషధారణలు

నిలిచిన రిజిస్ట్రేషన్లు

- సాంకేతిక సమస్యే కారణమంటున్న అధికారులు
- పనిచేయని సర్వర్లు
- వరుస సెలవులు కావడంతో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు కిటకిట
- తరుచూ సమస్యలు రావడంతో కక్షిదారులు అసహనం


పెద్దాపురం, ఏప్రిల్ 8: రాష్ట్రవ్యాప్తంగా రిజిస్ట్రేషన్ సేవలు మళ్లీ స్తంభించాయి. రిజిస్ట్రేషన్ల కోసం ప్రవేశపెట్టిన 2.0 సాఫ్ట్‌వేర్ ప్రజలకు చుక్కలు చూపిస్తోంది. సర్వర్ సమస్యతో ఉదయం నుంచి రిజిస్ట్రేషన్ సేవలు నిలిచిపోయాయి. ఉదయం కేవలం ఒక గంట మాత్రమే పనిచేసి మళ్లీ సర్వర్లు పనిచేయలేదు. రిజిస్ట్రేషన్లు చేయించుకునేందుకు తండోపతండాలుగా కార్యాలయాలకు వచ్చిన ప్రజలు తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేయడంతోపాటు గంటల తరబడి కార్యాలయం వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చింది. జిల్లాలో కొన్ని చోట్ల సర్వర్లు పనిచేయలేదు. ఇది కేవలం సాంకేతిక కారణం వల్లనే అని అధికారులు చెబుతున్నారు.

వరుసగా సెలవులు..

వరుసగా సెలవులు రావడంతో హడావుడిగా రిజిస్ట్రేషన్లు చేయించుకునేందుకు క్రయ, విక్రయదారులు కార్యాలయాలకు తరలివచ్చారు. ఈనెల 9న ఉగాది కావడం ఆ తర్వాత రంజాన్, మళ్లీ 13న రెండో శనివారం, మళ్లీ 14న అంబేడ్కర్ జయంతి ఇలా వరుసగా సెలవులు రావడంతో కక్షిదారులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు భారీగా వచ్చారు. తీరా సర్వర్లు సతాయించడంతో అసహనాన్ని వ్యక్తం చేశారు. 20రోజులుగా ఈసీలు రావడంలేదని దీంతో క్రయ విక్రయాలు, బ్యాంకు రుణాలు తదితర వ్యవహారాలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రిజిస్ట్రేషన్ శాఖలో నెలరోజులుగా ఇటువంటి సమస్యలు ఉత్పన్నం కావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సాంకేతిక సమస్యలను సరిచేయడంతో అధికారులు సరైన చర్యలు చేపట్టడంలేదని ప్రభుత్వం తీరును విమర్శిస్తున్నారు. నిత్యం కార్యాలయాల చుట్టూ తిరగడమే తమ పనా అంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తరచూ కార్డ్‌ప్రైమ్‌లో తలెత్తుతున్న సమస్యలను పరిష్కరించాలని మళ్లీ ఇటువంటి పరిస్థితి రాకుండా చూడాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

అధికారంలోకి రాగానే గంజాయి, మద్యాన్ని నిషేధిస్తాం

- ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజప్ప

పెద్దాపురం, ఏప్రిల్ 1: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి వచ్చిన మొదటి 100 రోజుల్లో గంజాయి, జే బ్రాండ్ మద్యాన్ని నిషేధిస్తామని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. పెద్దాపురం సుధా కాలనీలో ఉన్న క్యాంపు కార్యాలయంలో జనసేన పెద్దాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తుమ్మల రామస్వామి(బాబు), బీజేపీ నేత విత్తనాల వెంకటరమణతో కలిసి సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. జగన్ తీసుకువచ్చిన చీప్ లిక్కర్ కారణంగా ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారన్నారు. అధికారం చేపట్టిన తర్వాత చీప్ లిక్కర్‌ను పూర్తిగా నిషేధిస్తామన్నారు. వైసీపీ ప్రభుత్వంలో కిరాణాషాపులో సైతం గంజాయి దొరికే పరిస్థితి ఏర్పడిందన్నారు. జనసేన నేత తుమ్మల రామస్వామి(బాబు), బీజేపీ నేత విత్తనాల వెంకటరమణ మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ, కలయికతో తాడేపల్లి ప్యాలెస్‌లో వణుకు మొదలయ్యిందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభంజనం సృష్టించనుందన్నారు.

'వైసీపీ ప్రభుత్వంలో అరాచక, దౌర్జన్యం'

సామర్లకోట, ఏప్రిల్ 8: టీడీపీ ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమం బాటలో రాష్ట్రం పయనిస్తే నేటి వైసీపీ ప్రభుత్వ పాలనలో అరాచకం, దౌర్జన్యం రాజ్యమేలుతూ ఆంధ్రరాష్ట్రాన్ని నిరోమయం చేశారని జగన్‌రెడ్డి పాలనను పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప విమర్శించారు. సామర్లకోటలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పేదలకు టీడీపీ హయాంలో 12.50లక్షల టిడ్కో ఇళ్లను నిర్మించగా జగన్ పాలనలో గంజాయి, జె-బ్రాండ్ మద్యం, డ్రగ్స్ తీసుకొచ్చాడన్నారు.ఐదేళ్లుగా ముస్లింలపై వైసీపీ నాయకుల అరాచకాలు శృతి మీరుతున్నాయన్నారు. ఏప్రిల్ 4న నమాజ్‌చేసి తిరిగొస్తున్న ముస్లిం మహిళపై వైసీపీ నేత దాడికి పాల్పడ్డాడన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా జగనన్న కాలనీ

- నిర్మాణాలకు అనువుగా లేక పోవడంతో ఆగిన వైనం
- స్థలాల చదును పేరుతో సొమ్ము చేసుకున్న నాయకులు

గండేపల్లి, ఏప్రిల్ 8: సీఎం జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో ప్రతీ పేద కుటుంబానికి సొంతింటి నిర్మిస్తానని చెప్పిన మాట నెరవేరలేదు కానీ.. జగనన్న కాలనీలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. గండేపల్లి మండలంలో 2300మందికి జగనన్న ఇళ్ల స్థలాలు మంజూరయ్యాయి. గండేపల్లి, మల్లేపల్లి, ఉప్పలపాడు గ్రామాల్లో అయితే పోలవరం గట్టును చదునుగా చేసి రూ.80లక్షలకు పైగా ప్రభుత్వ సొమ్ము ఖర్చు చేసి వెయ్యిమందికిపైగా స్థలాలు కేటాయించారు. ఆ స్థలాల్లో గృహాలు నిర్మించుకునేందుకు అనుకూలంగా లేకపోవడంతో లబ్ధిదారులు ఆ స్థలాలను నిరాకరించారు. అనువైనచోట స్థలాలు ఇవ్వాలని అధికారులు, నాయకులు చుట్టూ తిరిగినా కాలం గడుపుకొచ్చారు తప్ప న్యాయం చేయలేకపోయారు. దీంతో పేదవాడి సొంతింటి నిర్మాణం కలగానే మిగిలిపోయింది. రూ.80లక్షల ప్రభుత్వ సొమ్ముతో చదును చేసిన కాలనీలు అసాంఘిక కార్యకలాపాలకు అనువుగా మారాయి. ఆ ప్రాంతంలో చెట్లు మొలవడంతో ఆ ప్రాంతమంతా భయంకరంగా మారింది. దీంతో పగలు, రాత్రి సమయాల్లో ఎవరూ రాకపోవడంతో మద్యం సేవించడానికి ఇతర అసాంఘిక కార్యకలాపాలకు అనువుగా మారింది. ఆ ప్రాంతంలో ఎదిగిన చెట్లను నరికేసి వంట చెరకుగా ఉపయోగించుకుంటున్నారు. ఆప్రాంతానికి శివారున చెట్ల మధ్య నాటుసారా స్థావరాలు ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం. గ్రామాల్లో పర్యటిస్తున్న వైసీపీ నాయకులను వీటిపై లబ్ధిదారులు నిలదీస్తున్నారు. పేదల సొంతింటి కల అని చెప్పి గట్టును చదును చేసేందుకు లక్షల్లో డబ్బులు జేబులు నింపుకున్నారని విమర్శిస్తున్నారు.



గండేపల్లి మండలం మల్లేపల్లిలో పోలవరం గట్టుపై జగనన్న కాలనీ స్థలంలో మద్యం సీసాలు

నేటి నుంచి లోవతల్లి దర్శనం

- 15 నెలలుగా బాలలయంలోనే దర్శనం

స్నేహితుడి జ్ఞాపకాలు మరువలేక యువకుడి ఆత్మహత్య

జిల్లా టీడీపీ కార్యాలయం తనిఖీకి ప్రయత్నం

ఉగాదికి ఆలయాల ముస్తాబు

14న జనచైతన్య యాత్ర

జాతీయ ఉపాధి హామీ పనుల్లో పురోగతి సాధించాలి: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్ 8: జిల్లాలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి నిర్దేశించిన లక్ష్యంలో పురోగతి సాధించాలని జిల్లా కలెక్టర్ జె.నివాస్ అధికారులను ఆదేశించారు. సోమవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి వెలగపూడి సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జాతీయ ఉపాధి హామీ పనులు, పని దినాలు, తాగు నీటి సరఫరా, విద్యుత్తు సరఫరా వంటి అంశాలపై ఆయన సమీక్ష నిర్వహించారు. కాకినాడ జిల్లాలో అన్ని పంచాయతీల్లో అన్ని ఆవాసాల్లో ఉపాధి పనులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ బదులిచ్చారు. ఉపాధి కూలీల దిన సరి వేతనం రూ.300కు పెరిగినందున ఉపాధి పనులకు ఏర్పాటు చేసే కూలీల సంఖ్యపై దృష్టిని క్రేంద్రీకరించాలని కలెక్టర్ సూచించారు. ఉపాధి హామీ కూలీలు వడదెబ్బ తగలకుండా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పని ప్రదేశంలో ఓఆర్ఎస్, తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. వేసవి దృష్ట్యా విద్యుత్తు సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్వో తిప్పే నాయక్, డ్వామా పీడీ వెంకట లక్ష్మి, డీపీవో భారతి సౌజన్య, ఏపీఈపీడీసీఎల్ ఈఈ ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ శ్రీనివాస్, కాకినాడ కార్పొరేషన్ ఎస్ఈ సత్యకుమారి, డీఆర్‌డీఏ పీడీ శ్రీరమణి పాల్గొన్నారు.



కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ జె.నివాస్

పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ సజావుగా జరగాలి

- పీవో, ఏపీవోలు సమర్థవంతంగా విధులు నిర్వహించాలి: కలెక్టర్



కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్ 8: ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని, దీనికోసం పోలింగ్ సిబ్బంది పూర్తి అవగాహనతో ఉండాలని కలెక్టర్ జె.నివాస్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ విధాన గౌతమి సమావేశ మందిరంలో అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనింగ్ శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఎన్నికల క్రతువులో పాల్గొనే పీవోలు, ఏపీవోలు విధులు సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఈనెల 12, 13 తేదీల్లో పీవోలు, ఏపీవోలకు అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో, ఈ నెల 15, 16 తేదీల్లో ఓపీవోలకు శిక్షణ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఎన్నికల నిర్వహణ విజయవంతం అవ్వడానికి సిబ్బంది శిక్షణా కార్యక్రమాలు అత్యంత కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ఎన్నికల క్రతువులో ఎలాంటి సందేహాలు లేకుండా ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేయాలన్నారు. జిల్లాలో ఎన్నికలు విజయవంతం కావాలంటే సమష్టిగా పనిచేయాలన్నారు. ఎన్నికల నియమావళిని పాటిస్తూ అధికారులు సమన్వయంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో జేసీ రామ్‌సుందర్‌రెడ్డి ఈవీఎం, వీవీ ప్యాట్లు, పీవో డైరీ ప్రాముఖ్యత, మాక్ పోలింగ్, ఏజెంట్ల నియామకం, ఓటింగ్ ప్రక్రియ, ఓటింగ్ ముగింపు దశ వంటి వాటిపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ చేశారు.



చేబ్రోలులో పవన్‌కల్యాణ్ ఉగాది వేడుకల్లో పాల్గొనే ఇంటి వద్ద ఏర్పాటుచేసిన చలువ పందిరి

నేడు పవన్‌కల్యాణ్ రాక

- చేబ్రోలులో ఉగాది వేడుకల్లో పాల్గొననున్న జనసేనాని
- నూతన గృహ ప్రవేశం, ముస్తాబవుతున్న నివాస గృహం

గొల్లప్రోలురూరల్, ఏప్రిల్ 8: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ మంగళవారం పిఠాపురం నియోజకవర్గానికి రానున్నారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులో జరగనున్న ఉగాది వేడుకల్లో ఆయన పాల్గొననున్నారు. పిఠాపురం నియోజకవర్గంలోని 54 గ్రామాల్లో ఏదోకచోట ఇల్లు తీసుకుని ఉంటానని చెప్పిన పవన్‌కల్యాణ్ అందుకు తగ్గట్టుగా చేబ్రోలు బైపాస్‌రోడ్డులో 216వ జాతీయరహదారి చెంతనే నూతనంగా నిర్మించిన గృహాన్ని అద్దెకు తీసుకున్నారు. పవన్ నివాసముండేందుకు అనువుగా ఇంటిని తీర్చిదిద్దారు. నూతన గృహ ప్రవేశం చేయనున్నారు. ఇక్కడే జనసేన కార్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఉగాది వేడుకలను ఇక్కడే జరుపుకుంటానని పవన్ ప్రకటించిన నేపథ్యంలో చేబ్రోలులోని నివాసంలో అందుకు తగ్గ ఏర్పాట్లు చేయడంలో జనసేన శ్రేణులు నిమగ్నమయ్యాయి. ఇప్పటికే ఇంటి వద్ద చలువ పందిరిని నిర్మించారు. మామిడి తోరణాలతో ఇంటిని అలంకరిస్తున్నారు. ఇంటి ఆవరణలో ఏర్పాటుచేసిన చలువ పందిరిలోనే పవన్ ఉగాది వేడుకల్లో పాల్గొంటారని జనసేన నాయకులు చెబుతున్నారు. పంచాంగ శ్రవణం జరుగుతుంది. మంగళవారం ఉదయం 10గంటలకు గొల్లప్రోలు హెలిప్యాడ్‌కు చేరుకుని అక్కడి నుంచి చేబ్రోలు నివాసానికి చేరతారని సమాచారం. ఇంటిలోకి కొబ్బరికాయ కొట్టి ప్రవేశిస్తారు. ఇప్పటికే చేబ్రోలు నివాసంవద్ద పవన్ వ్యక్తిగత భద్రతా సిబ్బంది మోహరించారు. పనులు చేస్తున్న వారిని మినహాయించి మిగిలిన వారిని లోపలకు అనుమతించడం లేదు.

పూల మార్కెట్‌కు ఉగాది శోభ



కడియపులంక పూలమార్కెట్‌లో విక్రయానికి సిద్ధంగా ఉన్న పూలు

కడియం, ఏప్రిల్ 8: కడియపులంక అంతర్రాష్ట్ర పూలమార్కెట్ ఉగాది శోభను సంతరించుకుంది. రెండురోజుల నుంచి పూల అమ్మకాలు ఊపందుకున్నాయి. వేసవి తీవ్రతతో దిగుబడులు తగ్గాయని రైతులు అంటున్నారు. దీంతో పూల ధరలు పెరిగాయి. ప్రస్తుతం కడియపులంక పూలమార్కెట్‌లో పూలధరలు ఇలా ఉన్నాయి. మ ల్లెలు (కిలో) రూ.800, లిల్లీ (కిలో)రూ.100, పసుపు చామంతి (కిలో) రూ.250-300, వైట్ చామంతి(కిలో) రూ.300-350, నీలం చామంతి(కిలో) రూ.300, పసుపు బంతి(కిలో) రూ.50-80, కలకత్తా బంతి(కిలో) రూ.80-100, స్టార్ గులాబీ(కిలో) రూ.250, డచ్ (20పూలు) రూ.300, కనకంబరం (బారు-1) రూ.120-130, దేశవాళీ గులాబీ (100 పూలు) రూ.100 ఉన్నాయి.

కాటన్ బ్యారేజ్ చెక్‌పోస్టు వద్ద తనిఖీల్లో

రూ.7 లక్షలు స్వాధీనం



ధవళేశ్వరంలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది

ధవళేశ్వరం, ఏప్రిల్ 8: సాధారణ ఎన్నికలు సందర్భంగా కాటన్ బ్యారేజ్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన చెక్‌పోస్టువద్ద సీఐ వినయ్‌మోహన్ ఆధ్వర్యంలో సోమవారం వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా నిడదవోలు నుంచి కారులో ప్రయాణిస్తున్న జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు సెక్రటరీ డి.అనిత వర్ధిని నుంచి రూ.7,07,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యలు అనంతరం ఎఫ్ఎస్‌టీ టీంకు అప్పగించినట్టు ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపారు.

పవరలో రూ.1.20 లక్షలు స్వాధీనం

సామర్లకోట, ఏప్రిల్ 8: కాకినాడ జిల్లా సామర్లకోట మండలం పవర గ్రామ పంచాయతీ కార్యాలయం సమీపాన ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు వాహనాలు తనిఖీలు చేస్తుండగా ఫకృద్దీన్ పాలెం గ్రామానికి చెందిన రెడ్డి గంగరాజు అనే వ్యక్తి ఎటువంటి పత్రాలు బిల్లులు లేకుండా తన వాహనంలో రూ.1.20లక్షల నగదు తీసుకె ళ్తున్నట్టు గుర్తించి ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి పెద్దాపురం మండల వ్యవసాయాధికారి కె.సంజయ్‌కుమార్ స్వాధీనం చేసుకున్నట్లు పెద్దాపురం ఆర్వో సీతారామారావు వెల్లడించారు. ఈ మేరకు సోమవారం ఆర్వో మాట్లాడుతూ స్వాధీనం చేసుకున్న నగదును ట్రెజరీకి అప్పగించనున్నట్లు చెప్పారు.

అరచేతితో అడ్డుకుందాం..

- ఎన్నికల ఫిర్యాదులు.. సమాచారం కోసం ఏడు యాప్‌లు
- సామాన్య పౌరులను భాగస్వాములను చేస్తూ..
- కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో సామాన్య పౌరులను భాగస్వాములను చేస్తూ ఎన్నికల కమిషన్ పలు రకాల యాప్‌లను అందుబాటులోకి తీసుకువచ్చిందని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా సోమవారం తెలిపారు. ఎన్నికల ఫిర్యాదులు, సమాచారం కోసం ఏడు యాప్‌లను ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. సార్వత్రిక ఎన్నికల నిబంధనావళి ఉల్లంఘన, ఇతర సమాచారల కోసం ఈ యాప్‌లను వినియోగించవచ్చు. సీ-విజిల్, సువిధ, కేవైసీ, అబ్జర్వర్, సాక్ష్యం, ఓటర్ హెల్ప్‌లైన్, నేషనల్ గ్రీవెన్స్ సర్వీస్ పోర్టల్ యాప్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఓటర్లకు అవసరమైన సాయం, కోడ్ ఉల్లంఘనపై ఫిర్యాదులు, ఎన్నికల ఖర్చు, పోలింగ్ బూత్‌ల వివరాలు, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల గురించి సమాచారం తెలుసుకునేందుకు వీటిని ఉపయోగించుకోవచ్చునన్నారు.

నామినేషన్ల కోసం సువిధ యాప్

ఎన్నికల సమయంలో అభ్యర్థులు నామినేషన్ అనుమతి ప్రక్రియలో సహాయం చేసేందుకు సువిధ యాప్‌ను తీసుకువచ్చారు. పోటీచేసే అభ్యర్థులు ఖాతాను రిజిస్టర్ చేసుకుని వారి ఆధారాలతో లాగిన్ చేయాలి. ఆ తరువాత అభ్యర్థులు తమ నామినేషన్ల అనుమతిని యాప్‌లో చూసుకోవచ్చు. సువిధ క్యాండిడేట్ యాప్ అభ్యర్థులకు అనేక ఇతర ఫీచర్లు అందిస్తోంది. ప్రచారానికి అవసరమైన అనుమతుల గురించి తెలుసుకోవచ్చు.

ఎన్నికల ఉల్లంఘనలకు సీ-విజిల్ యాప్



ఎన్నికల ఉల్లంఘనలపై సాక్ష్యాలతో సహా ఈ యాప్‌లో పొందుపరచవచ్చు. ఫొటో, వీడియో, ఆడియో రూపంలో రికార్డింగుచేసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఫిర్యాదు చేసిన ఐదు నిమిషాల్లో ఎన్నికల అధికారులు రంగంలోకి దిగుతారు. దీనిపై విచారణ జరిపి వంద నిమిషాల్లో ఫిర్యాదుపై ఖచ్చితమైన చర్యలు తీసుకుంటారు. పార్టీలకు అతీతంగా ఎవరు ఉల్లంఘనలకు పాల్పడ్డా ఫిర్యాదు చేయవచ్చు. గూగుల్ ప్లేస్టోర్ నుంచి యాప్‌ను డౌన్లోడ్ చేసుకోవాలి. ప్రధానంగా ఎన్నికల్లో డబ్బులు పంపిణీ, బహుమతుల అందజేత, రెచ్చగొట్టే ప్రకటనలు, మత్తు పదార్థాల పంపిణీ, ఓటర్లను ప్రభావితం చేయడం, ఎన్నికల రోజు ఓటర్లను వాహనాల్లో తరలించడం. ఇటువంటి ఉల్లంఘనలను ఫొటో, వీడియో, ఆడియోలో క్లిప్‌లు అప్‌లోడ్ చేయాలి. వెంటనే జిల్లా ఎన్నికల అధికారి స్పందించి ఫిర్యాదుదారునికి తీసుకున్న చర్యలపై తెలుసుకునేవిధంగా వెసులుబాటు కల్పించారు.

ఓటరు హెల్ప్‌లైన్ యాప్



ఓటరు హెల్ప్‌లైన్ యాప్‌లో కొత్త ఓటర్ల నమోదు చేసుకోవచ్చు. ఓటర్ల జాబితాలో జనాభా వివరాలు, ఎన్నికల ప్రవర్తనా నియమావళికి సంబంధించి ఫిర్యాదుల స్వీకరణకు ఈ యాప్ ఉపయోగపడుతుంది.

నేషనల్ గ్రీవెన్స్ సర్వీస్ పోర్టల్

ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదుల పరిష్కారానికి, ఈసీకి సహాయం చేయడంలో నేషనల్ గ్రీవెన్స్ సర్వీస్ పోర్టల్ కీలకపాత్ర పోషిస్తోంది. ఓటరు తమ మొబైల్ నంబరు ఉపయోగించి పోర్టల్‌లో వారి ప్రొఫైల్ నమోదు చేసుకోవచ్చు. ఓటరు తమ ఫిర్యాదును నమోదుచేసిన తరువాత విచారణ కోసం ఎన్నికల అధికారికి పంపిస్తారు. నిర్ణీత వ్యవధిలోగా అధికారులు స్పందించి చర్యలు తీసుకుంటారు. పోలింగ్ బూత్ స్థానాలు, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, ఎన్నికల ఖర్చు, ఎన్నికల అక్రమాలకు సంబంధించిన ఫిర్యాదులను సకాలంలో ఈ యాప్ పరిష్కరిస్తోంది.

దివ్యాంగుల కోసం సాక్ష్యం యాప్



వివిధ్న ప్రతిభావంతులైన దివ్యాంగులు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడంలో అవసరమైన వసతులు పొందేందుకు సాక్ష్యం యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. దివ్యాంగులకు వీల్‌చైర్లు ఏర్పాటు చేయడంతో పాటు ఇతర వసతుల కోసం ఈ యాప్‌లో నమోదు చేసుకోవాలి. సంబంధిత అధికారులు దివ్యాంగులకు అవసరమైన అన్ని వసతులను కల్పించి ఓటు హక్కును సద్వినియోగం చేసుకునే విధంగా యాప్ ఉపకరిస్తుంది.

సీపీఐ(ఎం) ఎమ్మెల్యే అభ్యర్థిగా లోతా రామారావు



రంపచోడవరం, ఏప్రిల్ 8: రంపచోడవరం సీపీఐ(ఎం) ఎమ్మెల్యే అభ్యర్థిగా లోతా రామారావు పేరును ఆ పార్టీ సోమవారం ఖరారు చేసింది. రాజవొమ్మంగి మండలం లోదొడ్డి పంచాయతీ కేశవరం గ్రామానికి చెందిన లోతా రామారావు ప్రస్తుతం గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగాను, రాజవొమ్మంగి మండలం లోదొడ్డి సర్పంచ్‌గాను ఉన్నారు. రామారావు గత కొన్నేళ్లుగా ప్రజాసమస్యలపై గిరిజన సంఘం, సీపీఎం పార్టీల తరుపున పోరాటాలు చేస్తున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్, సీపీఐ(ఎం), సీపీఐ పార్టీల పొత్తులో భాగంగా రంపచోడవరం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా లోతా రామారావు పోటీ చేయనున్నారు.


కిక్ బాక్సింగ్ విజేతకు నగదు ప్రోత్సాహకం



బహుమతిని అందజేస్తున్న వీసీ పద్మరాజు

దివాన్‌చెరువు, ఏప్రిల్ 8: అఖిల భారత విశ్వవిద్యాలయాల కిక్ బాక్సింగ్ చాంపియన్ షిప్‌లో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి కాంస్య పతకం సాధించిన సీహెచ్ దినేష్‌కు రూ.20 వేల నగదు ప్రోత్సాహకాన్ని వీసీ ఆచార్య కె.పద్మరాజు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ మీరట్‌లోని స్వామీ వివేకానంద సుబర్తి విశ్వవిద్యాలయంలో జరిగిన చాంపియన్‌షిప్‌లో దినేష్ 81 కిలోల విభాగంలో కాంస్య పతకాన్ని కైవసం చేసుకు న్నారన్నారు. దినేష్ నన్నయ అనుబంధ కళాశాలయైన రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్నాడని తెలిపారు. ప్రతిభా వంతులైన క్రీడాకారులకు విశ్వవిద్యాలయం సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో క్రీడాబోర్డు కార్యదర్శి బి.రామ్ గోపాల్, కిక్ బాక్సింగ్ కోచ్ ఎం.భవానీశంకర్ పాల్గొన్నారు.





స్వయంభు తలుపులమ్మ తల్లి, నిర్మాణంలో ఉన్న మహా మండపం



పనులు పర్యవేక్షిస్తున్న ఆలయ ఇన్‌చార్జ్ డీసీ

నేటి నుంచి లోవతల్లి దర్శనం

- 15 నెలలుగా బాలాలయంలోనే దర్శనం

తుని రూరల్, ఏప్రిల్ 8: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం లోవ దేవస్థానం భక్తుల అవసరాలకు అనుగుణంగా ఆలయ పునఃనిర్మాణ పనులు చేపట్టడంతో గత 15నెలలుగా అమ్మవారు బాలలయంలోనే దర్శనమిస్తున్నారు. 4అంతస్తుల మహా మండపం, 9 అంతస్తుల రాజగోపురం నిర్మాణంతో పనులు చివరికి చేరడంతో అమ్మవారి ప్రధాన గర్భాలయంలో అమ్మవారి పునఃదర్శనాలు మంగళవారం నుంచి ప్రారంభించనున్నట్లు ఇన్‌చార్జ్ డిప్యూటీ కమిషన్ డి.విశ్వనాథ్‌రాజు తెలిపారు. మంగళవారం నుంచి ఐదురోజులు మహిళా భక్తులచే కుంకుమ పూజలు నిర్వహించనున్నారు.

4 అంతస్తుల మహా మండపం

ఆలయంలో పూర్వం ఉన్న క్యూలైన్‌లు తొలగించి ఆ స్థానంలో 4అంతస్తుల మహామండపం నిర్మిస్తున్నారు. మొదటి మండపంలో వినాయకుడి గుడి, టిక్కెట్ కౌంటర్లు ఏర్పాటు చేయనున్నారు. 2వ మండలం షాపింగ్ కాంప్లెక్స్‌లు, 3వ మండపంలో భక్తులు వేచి ఉండేందుకు క్యూ కాంప్లెక్స్‌లు, 4వ మండపంలో అమ్మవారి పంచలోహ విగ్రహాల ఏర్పాట్లు, గర్భాలయంలో అమ్మవారిని దర్శించుకున్న తరువాత ఆశీర్వాదాలకు, పర్వదినాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. 9 అంతస్తుల రాజగోపురం నుంచి దిగువకు మెట్లు నిర్మిస్తున్నారు. ప్రస్తుత రాజగోపుర నిర్మాణం దక్షిణం నుంచి తాత్కాలిక మెట్ల మార్గాన్ని ప్రధాన గర్భాలయంకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 15 నెలలు తరువాత అమ్మవారి దర్శన భాగ్యం కలుగనుండటంతో ఆలయంలో రద్దీ ఏర్పడే అవకాశం ఉంది. అందుకు అనుగుణంగా ఆలయ ఈవో సిబ్బందితో చర్చించి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు.

కొత్త సంవత్సరంలో..

గృహనిర్మాణశాఖ ఉద్యోగులకు జీతాలు అందేనా!

- అయోమయ పరిస్థితిలో ఉద్యోగులు

అమలాపురంరూరల్, ఏప్రిల్ 8: నేటి నుంచి శ్రీక్రోధి నామ సంవత్సరం ప్రారంభమవుతుంది. కొత్త సంవత్సరంలోనైనా జీతాలు విడుదల అవుతాయో లేదో తెలియని అయోమయ పరిస్థితి గృహనిర్మాణశాఖలో నెలకొంది. గృహ నిర్మాణశాఖలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బందికి ఈ నెలలో ఎనిమిది రోజులు గడిచిపోయినా ఇంత వరకు జీతాలు విడుదల చేయలేదు. అసలు ఈ నెలకు జీతాలు అందుతాయో లేదో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గృహనిర్మాణ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఫిబ్రవరి, మార్చి నెలల జీతాలు విడుదల కాకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఫిబ్రవరి నెలకు సంబంధించి గృహనిర్మాణశాఖలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ కంప్యూటర్ ఆపరేటర్లు, వర్కింగ్ ఇన్‌స్పెక్టర్లకు మాత్రం మార్చి నెలలో జీతాలను చెల్లించారు. వారికి మార్చినెల జీతాలు విడుదల కాలేదు. గృహనిర్మాణశాఖలో ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న రెగ్యులర్ ఉద్యోగులకు, ఇతర సిబ్బందికి జీతాలను ప్రభుత్వం ఎప్పుడు విడుదల చేస్తుందో తెలియని అయోమయ పరిస్థితి. గత కొంతకాలంగా ఇదే పరిస్థితి నెలకొంది. జీతాలు సకాలంలో విడుదల కాకపోవడంతో ఈఎంఐలు సకాలంలో చెల్లించక ఉద్యోగులు, సిబ్బంది బ్యాంకులకు డిఫాల్టర్లుగా మిగిలిపోతున్నామని ఆ శాఖ ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ప్రతీనెలా అప్పులుచేసి కుటుంబాలను గడుపుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని సిబ్బంది ఆందోళన చెందుతున్నారు.

ఇద్దరు దింపు కార్మికుల మృతి

మలికిపురం, ఏప్రిల్ 8: గుడిమెళ్లంక గ్రామంలో నివాసం ఉంటున్న ఇద్దరు దింపు కార్మికులు వృత్తి రీత్యా పశ్చిమగోదావరి జిల్లా కాజా వైపు వెళుతుండగా పాలకొల్లు వైపు నుంచి వస్తున్న కారు వేగంగా వచ్చి వీరు ప్రయాణిస్తున్న మోటారు సైకిల్‌ను ఢీకొనడంతో సంఘటనా స్థలంలోనే వారు మృతిచెందినట్టు తెలిసింది. విశాఖ జిల్లా నక్కపల్లికి చెందిన కడియాల పెదమణియ్య(42), గూడి అప్పారావు(56)లు 15సంవత్సరాల క్రితం వృత్తి రీత్యా గుడిమెళ్లంక వచ్చి స్థిరపడ్డారు. దింపు పని కోసం వెళుతుండగా సోమవారం ఈ సంఘటన జరిగింది. అప్పారావుకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పెదమణియ్యకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ ప్రమాదం ఘటన తెలిసిన వెంటనే స్థానికంగా ఉంటున్న సహచర దింపు కార్మికుల్లో విచారం అలుముకుంది.

21 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

నల్లజర్ల, ఏప్రిల్ 8: అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న లారీని సీజ్‌చేసినట్టు సివిల్ సప్లై డీటీ సత్యనారాయణ తెలిపారు. సోమవారం ఉదయం సివిల్ సప్లై, దేవరపల్లి పోలీసులు సంయుక్తంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఖమ్మం నుంచి కాకినాడకు లారీలో 21 టన్నులు రేషన్ బియ్యం తరలిస్తున్నట్టు గుర్తించారు. అక్రమంగా పీడీఎస్ బియ్యం తరలిస్తున్న వ్యక్తులపై కేసు నమోదు చేసి, బియ్యాన్ని గోపాలపురం ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించారు.

యువకిడి ఆత్మహత్య



పాండ్రేకుల మహేష్

- స్నేహితుడి జ్ఞాపకాలు మరువలేక

యానాం, ఏప్రిల్ 8: యానానికి చెందిన యువకుడు తన స్నేహితుడి జ్ఞాపకాలు మరువలేక ఆత్మహత్య చేసుకున్నాడు. యానాం కుమ్మర్ల వీధికి చెందిన పాండ్రేకుల మహేష్(25) హైదరాబాద్‌లోని సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్నాడు. మహేష్ స్నేహితుడు చిక్కాల రత్నాకర్ గత ఏడాది ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ప్రాణస్నేహిడుతు ఆత్మహత్య మహేష్‌ను కొంత కలవరానికి గురిచేసింది. ఈనెల 4న రత్నాకర్ సంవత్సరికానికి హైదరాబాద్ నుంచి మహేష్ యానాం వచ్చాడు. స్నేహితుడి జ్ఞాపకాలతో మనస్తాపానికి గురైన మహేష్ ఆదివారంరాత్రి 11గంటల సమయంలో తాను చనిపోతున్నానని మరో మిత్రుడికి ఫోన్‌లో మెస్సేజ్ పంపాడు. విషయం కుటుంబ సభ్యులకు తెలియడంతో రాత్రంతా యానాం గోదావరి పరిసరాల్లో గాలించారు. కనకాలపేట సమీపంలో మహేష్ చెప్పులు, సెల్‌ఫోన్‌ను గుర్తించారు. మత్స్యకారుల సహాయంతో గాలించగా సోమవారం ఉదయం మృతదేహం లభ్యమైంది. మృతదేహం వద్ద తల్లిదండ్రులు, బంధువులు బోరున విలపించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రాణం తీసిన స్నానం సరదా

- గోదావరిలో జారి యువకుడు మృతి



అశోక్‌కుమార్ (ఫైల్‌ఫొటో)

కడియం/ధవళేశ్వరం, ఏప్రిల్8: సరదాగా స్నేహితులతో కలిసి ఓ యువకుడు గోదావరి స్నానానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తూ కాలుజారి ధవళేశ్వరం వద్ద గోదావరిలో గల్లంతయ్యాడు. స్థానికుల కథనం ప్రకారం.. కడియం మండలం దుళ్లకు చెందిన బర్నికల అశోక్‌కుమార్(18) తన స్నేహితులతో కలిసి ఆదివారం సాయంత్రం ధవళేశ్వరంవద్దకు గోదావరి స్నానానికి వెళ్లాడు. స్నానానికి దిగుతుండగా నాచుకు జారి గల్లంతయ్యాడు. స్నేహితులు గమనించి కేకలు వేయడంతో స్థానికులు వచ్చి అశోక్ మృతదేహాన్ని బయటకు తీశారు. ధవళేశ్వరం ఏఎస్ఐ శివాజీ సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. అశోక్‌కు తల్లిదండ్రులతోపాటు పెళ్లి కావలసిన అక్క ఉన్నారు. అశోక్ పదో తరగతి చదువుతుండగా తండ్రి రాజు అనారోగ్యానికి గురికావడంతో చదువుకు స్వస్తి చెప్పి తాపీ పనిలో చేరాడు. అప్పటి నుంచి కుటుంబ భారమంతా తానే మోస్తున్నాడు. కుమారుడి మృతితో కుటుంబ సభ్యుల రోధనలు మిన్నంటాయి.



హంస వాహనంపై ఊరేగుతున్న స్వామివారి

ఘనంగా అధ్యయనోత్సవాలు

- హంస వాహనంపై విహరిస్తున్న శ్రీవారు

ఆత్రేయపురం, ఏప్రిల్ 8: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక కల్యాణోత్సవాలకు ముందుగా నిర్వహించే అధ్యయనోత్సవాలు సోమవారం నాలుగవ రోజుకు చేరుకున్నాయి. క్షేత్రంలోని ముఖమండపంలో చతుర్వేద పారాయణం, ద్రవిడవేద పారాయణం వేదపండితులచే ఘనంగా నిర్వహించారు. స్వామివారికి అర్చక బృందం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం పల్లకి మహోత్సవం కన్నుల పండుగగా జరిగింది. రాత్రి గరుడ, సింహ, హంస వాహనాలపై స్వామివారు తీరువీధులలో విహరించి భక్తులకు కృపకటాక్షాలు అందించారు. మేళతాళ మంగళవాయిద్యాలు, బాణాసంచా కాల్పుల నడుమ గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. చంగోలం పారాయణం, నీరాజన మంత్రపుష్పం కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ఉపకమీషనర్, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అనంతబాబుపై ఎస్సీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

- సీపీఎం నాయకుల డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు కొమరం పెంటయ్య

కూనవరం, ఏప్రిల్ 8: ఎమ్మెల్సీ అనంతబాబుపై ఎస్సీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని సీపీఎం నాయకులు కొమరం పెంటయ్య, మండల కార్యదర్శి పాయం సీతారామయ్య అన్నారు. పార్టీ కార్యాలయంలో జరిగినవిలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రశాంతంగా ఉన్న ఏజెన్సీలో అనంతబాబు అలజడి సృష్టిస్తున్నారన్నారు. ఎన్నికల ప్రచారం పేరుతో ఈ ప్రాంతంలో పర్యటించి అమాయక గిరిజనులపై దాడులు జరిపించడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. రాత్రి వేళల్లో పర్యటించి తమ హక్కుల కోసం ప్రశ్నించిన రాము, వినోద్‌పై పోలీసుల చేత దారుణంగా కొట్టించారన్నారు. పోలీసులు సైతం అత్యుత్సాహం ప్రదర్శించి అమాయక గిరిజనులను కొట్టడం ఎంతవరకు న్యాయమన్నారు. ఇప్పటికే దెబ్బలు తిన్న యువకులను పోలీసులు స్టేషన్‌కు పిలిపించి వారిని బెదిరించే ధోరణిలో మాట్లాడి కేసును పక్కదారి పట్టించారన్నారు. దీనిపై త్వరలోనే ఎన్నికల కమిషన్‌ను, పోలీసు ఉన్నతాధికారులను కలిసి న్యాయం జరిగే వరకు పోరాటం సాగిస్తామన్నారు. సీపీఎం జిల్లా నాయకులు మేకల నాగేశ్వరరావు, తాళ్ళూరి శ్రీనివాసరావు, బొర్రయ్య, కర్నాటి శ్రీనివాసరావు, మురళీ, పాయం సత్యనారాయణ పాల్గొన్నారు.

రంప దేశం టికెట్‌ను పార్టీలో పనిచేసే వారికే ఇవ్వాలి

- మాజీ ఎమ్మెల్యేలు వంతల, శీతంశెట్టి డిమాండ్
- పార్టీ పరిశీలకుడు తీరుపైనా అధిష్టానానికి ఫిర్యాదు



రంపచోడవరంలో మాట్లాడుతున్న వంతల, శీతంశెట్టి

రంపచోడవరం, ఏప్రిల్ 8: రంపచోడవరం అసెంబ్లీ టికెట్‌ను టీడీపీలో పనిచేసిన వారికి మాత్రమే కేటాయించాలని రంపచోడవరం మాజీ ఎమ్మెల్యేలు వంతల రాజేశ్వరి, శీతంశెట్టి వెంకటేశ్వరరావు, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు గొర్లె సునీత డిమాండ్ చేశారు. సోమవారం రంపచోడవరంలోని ఆర్కా అతిథి గృహ ఆవరణలో జరిగిన సమావేశ అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఇక్కడ అభ్యర్థిని మార్చాలని కోరారు. ఇక్కడ అభ్యర్థిత్వం విషయంలో వివాదం పార్టీ అధినేత చంద్రబాబు పరిశీలనలో ఉండగా ఇక్కడ పార్టీ పరిశీలకుడు తన పరిధిని దాటి తానే అధిష్ఠానం అన్నట్టుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పరిశీలకుడిగా ఇక్కడి వ్యవహారాలను పరిశీలించి, నివేదించాల్సిన బాధ్యతను విస్మరించి నాయకులను సస్పెండ్ చేస్తానంటూ బెదిరిస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల సమయం దగ్గర పడిన నేపథ్యంలో ఇక్కడ పరిస్థితులను చక్కదిద్ది పార్టీలో పనిచేసిన వారికే టికెట్‌ను కేటాయించాలని కోరారు.

ఘనంగా ప్రత్యంగిర హోమం

అన్నవరం, ఏప్రిల్ 8: పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో సోమవారం అమావాస్య సందర్భంగా పండితులు ప్రత్యంగిర హోమం ఘనంగా నిర్వహించారు. గణపతిపూజతో ప్రారంభించి ప్రత్యంగిర దేవతను ఆవాహన గావించారు. హోమాలు, జపములు, పారాయణలు నిర్వహించారు. పవిత్ర హోమగుండంలో సుగంధద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు అనంతరం తీర్థప్రసాదాలందజేశారు.

నూకాలమ్మ జాతర మహోత్సవాలు

» అమ్మవారికి ప్రత్యేక పూజలు » ఆకట్టుకున్న విచిత్ర వేషధారణలు, గరగ నృత్యాలు

గొల్లప్రోలు, ఏప్రిల్ 8: గొల్లప్రోలు పట్టణంలోని పాతబస్టాండు వద్ద వేంచేసి ఉన్న నూకాలమ్మ తల్లి జాతర వైభవంగా జరిగింది. బస్టాండు వద్ద గల అమ్మవారి ఆలయం నుంచి ప్రారంభమైన జాతర రాత్రంతా పురవీధుల్లో సాగి సోమవారం ఉదయం తిరిగి ఆలయం వద్దకు చేరింది. జాతరలో భాగంగా అమ్మవారివేషధారణలో కళాకారులు ప్రదర్శించిన విచిత్రవేషధారణలు, గరగ నృత్యాలు భక్తులను అలరించాయి. గొల్లప్రోలులోని బస్టాండు, కరణంగారి తోట, కొత్తపేటల్లోని నూకాలమ్మ తల్లి ఆలయాలు ఉదయం నుంచి రాత్రి వరకూ భక్తులతో కిక్కిరిశాయి. అమ్మవారిని దర్శించి నైవేద్యాలు, మొక్కు లు సమర్పించారు. ఆలయ కమిటీ ప్రతినిధులున్నారు.

గొల్లప్రోలు రూరల్: మండలంలోని చెందుర్తి, చేబ్రోలు తదితర గ్రామాల్లో నూకాలమ్మతల్లి జాతర మహోత్సవాలు వైభవంగా జరిగాయి. చెందుర్తిలోని ఆలయం వద్ద, గ్రామంలో ప్రధాన కూడళ్లలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారులు కోలాట నృత్యం, గరగనృత్యాలు ఆకట్టుకున్నాయి. రాత్రి నుంచి ఉదయం వరకూ జాతర అనం తరం నూకాలమ్మను భక్తులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. అమ్మవారికి చీర, జాకెట్టు, గాజులు సమర్పించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

పిఠాపురం: పట్టణంలోని పెద్దబజారులో ఉన్న నూకాలమ్మ తల్లి జాతర మహోత్సవాలు వైభవంగా జరిగాయి. భజనలు, గరగ నృత్యాలు నిర్వహించారు. సినిమా సెంటర్‌లో ఉన్న సత్తెమ్మతల్లి గుడి నుంచి పురవీధుల మీదుగా నూకాలమ్మ గుడి వరకూ జాతర జరిగింది. నూకాలమ్మ తల్లి ఆలయానికి భక్తులు పోటెత్తారు. సోమవారం తెల్లవారుజాము నుంచే భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. రాత్రి వరకూ రద్దీ కొనసాగింది. ఆలయం వద్ద తీర్థం వైభవంగా జరిగింది. అమ్మవారికి భక్తులు నైవేద్యాలు, మొక్కుబడులు చెల్లించారు. సాయంత్రం భజనలు నిర్వహించారు.

పిఠాపురం రూరల్: పిఠాపురం మండలం కోలంక గ్రామంలో నూకాలమ్మ జాతర వైభవంగా జరిగింది. అమ్మవారిని భక్తులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. తీర్థం జరిగింది. నూకాలమ్మను కాకినాడ జనసేన ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆత్మ మాజీ చైర్మన్ ఎలుబండి రాజారావు ఉన్నారు.

పెద్దాపురం: మండలంలోని కాండ్రకోట నూకాలమ్మ జాతర మహోత్సవాల్లో భాగంగా సోమవారం చల్లఘటాన్ని ఊరేగింపు ఉత్సవాన్ని నిర్వహించారు. దేవస్థానం ఈవో టీవీ సూర్యనారాయణ, చైర్మన్ గవరసాన వీరాస్వామి ఆధ్వర్యంలో గరగల నృత్యాలు, డప్పు వాయిద్యాలతో చల్ల ఘటాన్ని ఊరేగింపు చేపట్టారు. గ్రామంలో పంటలు సుభీక్షంగా పండాలని, పాడిపంటలు సమృద్ధిగా వృద్ధి చెందాలని ఆచారం ప్రకారం ఈ కార్యక్రమం నిర్వహించారు.

అన్నవరం: మండపం గ్రామంలో నూకాలమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. అన్నవరం పరిసర ప్రాంత వాసులు అమ్మవారిని దర్శించి నైవేద్యాలు సమర్పించారు. వారికి అసౌక ర్యం కలుగకుండా ఆలయకమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు వాసవీక్లబ్, బ్రాహ్మణ సంఘం, యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేపట్టారు.

పోర్టుసిటీ(కాకినాడ): కొత్త అమావ్యాస, ఉగాది పండుగ పురస్కరించుకుని నగరంలోని నూకాలమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. టూటౌన్ నూకాలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. పెద్ద మార్కెట్, కొండయ్యపాలెం, డెయిరీఫారమ్ నూకాలమ్మ మాన్యం ప్రాంతాల్లో అమ్మవారి ఆలయాలు కిటకిటలాడాయి.

సామర్లకోట: సామర్లకోటలో నూకాంబికా ఆలయం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు కుటుంబసభ్యులతో అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు వల్లూరి బుల్లియ్య, బోళ్ళ శేఖర్, యార్లగడ్డ శ్రీనివాస్, పెనుమర్తి పెద్దఅబ్బులచే భక్తులకు ఏర్పాట్లు చేశారు. అమ్మవారిని విశేషంగా అలంకరించి పూజలు చేశారు. మండలంలో హుస్సేన్‌పురం మదుగులమ్మ, వేట్లపాలెంలో మహాలక్ష్మి, వీకె.రాయపురం సత్తెమ్మ, గొంచాల, అచ్చంపేటలలో శ్యామలాంబ ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఏలేశ్వరం: మండలంలోని లింగంపర్తి, సిరిపురం గ్రామాల్లో శ్రీనూకాలమ్మ ఆలయాల వద్ద తీర్థ మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో కాళీమాత, నవదుర్గా, శక్తివేశాలు, వేట్లపాలెం వారిచే నిర్వహించిన బాణాసంచా కాల్పులు, గరగరగనృత్యాలు ఆకట్టుకున్నాయి. నూకాలమ్మను ప్రతిపాడు కూటమి అభ్యర్థి వరుపుల సత్యప్రభ తనయుడు సాయి తర్షిత్, కుటుంబ సభ్యులు దర్శించుకుని చీర,రవిక, గాజులు సమర్పించి మెక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ జ్యోతుల పెదబాబు, బ్యాంక్ రాజు, పెంటకోట శ్రీధర్,వైభోగుల సుబ్బారావు తదితరులున్నారు.


గొల్లప్రోలులో నూకాలమ్మ, సామర్లకోటలో అమ్మవారు

కరప: పెదకొత్తూరు, చినకొత్తూరు గ్రామాల్లో సోమవారం గ్రామదేవతలు గోగులమ్మతల్లి తీర్థం ఘనంగా జరిగింది. భక్తులు అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సర్పంచ్ చింతా నాగలక్ష్మిబుజ్జి, మాజీ సర్పంచ్ చింతా దుర్గాశ్రీ, వైసీపీ మండలాధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, చోడిశెట్టి చంటి, తోటకూర శ్రీను, జనసేన నాయకులున్నారు.

తొండంగి: కొత్త అమావాస్య సందర్భంగా మండలంలోని ఏ.కొత్తపల్లి నూకాలమ్మ ఆలయం వద్ద అమ్మవారికి ఊయల ఉత్సవం జరిపి ప్రత్యేక నైవేద్యాలు సమర్పించారు. ఏవినగరం గంగాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. శృంగవృక్షంలో పెద్దింట్ల, నూకాలమ్మ ఆలయాల్లో ఉదయం నుంచి భక్తుల రద్దీ ఉంది. అలాగే కొమ్మనాపల్లిలో ముత్యాలమ్మ ఆలయం వద్ద ఉత్సవం నిర్వహించారు.

తుని రూరల్: ఎస్.అన్నవరం గ్రామంలో ఇటీవల నూతనంగా ప్రతిష్ఠించిన నూకాలమ్మను దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు క్యూ కట్టారు. తేటగుంట, డి.పోలవరం, ఎస్ఎస్‌వీ నగరం గ్రామాల్లో సంబరాలు నిర్వహించి మొక్కులు చెల్లించారు.

కిర్లంపూడి: కిర్లంపూడిలో గ్రామదేవత నూకాలమ్మతల్లి జాతర వైభవంగా నిర్వహించారు. భక్తులు మొక్కులు తీర్చుకునేందుకు భారీగా తరలివచ్చారు. గరగనృత్యాలు,వివిధ వేషధారణలు ఆకట్టుకున్నాయి.


పిఠాపురంలో దర్శనానికి బారులుతీరిన భక్తులు

ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై నిఘా పెంచాలి : ఆర్వో


ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడుతున్న ఆర్వో శ్రీనివాసరావు

ప్రత్తిపాడు, ఏప్రిల్ 8: ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనకు సంబంధించి నిఘా పెంచాలని ప్రత్తిపాడు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.శ్రీనివాసరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మోడల్ కోడ్ ఆఫ్ కాండాక్ట్ బృందాలకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ కోడ్ ఉల్లంఘనకు సంబంధించి కేసులు నమోదు చేయాలని, దీనిపై విస్తృతంగా సిబ్బంది తనిఖీలు నిర్వహించాలని కోరారు. సీఐ శేఖర్‌బాబు మాట్లాడుతూ వాహనాల తనిఖీలు విస్తృతంగా చేపట్టాలన్నారు. సమావేశంలో ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి మండల తహశీల్దార్లు ఎస్. నరసింహారావు, వై.రంగారావు, వి.రాజకుమారి, సీహెచ్.విద్యాపతి, ఏలేశ్వరం నగర పంచాయతీ కమిషనర్ కె.శివప్రసాద్, ఎలక్షన్ డీటీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సంపద సృష్టించడం చంద్రబాబుకు తెలుసు : నవీన్

కాకినాడ సిటీ, ఏప్రిల్ 8: రాష్ట్రంలో సంపద సృష్టించడం, ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించడం చంద్రబాబుకు తెలుసని, అప్పులు చేస్తూ సంక్షేమంటున్న జగన్ రాష్ట్రాన్ని అధోగతి పాలు చేస్తున్నాడని టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సంక్షేమ పథకాలకు టీడీపీ పెట్టింది పేరని, సంక్షేమ పథకాలను ఎన్టీఆర్ బ్రాండ్ అంబాసిడర్ అన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 20లక్షలమంది ఉపాధి అవకాశాలు, నిరుద్యోగులు నెలకు రూ.3వేల చొప్పున నిరుద్యోగ భృతి అందిస్తామన్నారు. యువతకు మెగా డీఎస్సీ, జాబ్ కాలెండర్ విడుదల చేస్తామన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే చీప్ లిక్కర్‌ను నిషేధించడంతోపాటు మొదటి వంద రోజుల్లో గంజాయి,జె బ్రాండ్స్ మద్యాన్ని నిర్మూలిస్తామన్నారు.

టీడీపీ జిల్లా కార్యాలయం తనిఖీకి ప్రయత్నం

కాకినాడ సిటీ, ఏప్రిల్ 8: ఈ నెల 6న కాకినాడలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో 500 మందితో సమావేశం నిర్వహించారని అందిన ఫిర్యాదు మేరకు కార్యాలయం తనిఖీ చేసేందుకు రెవెన్యూ అధికారులు సోమవారం ప్రయత్నించారు. కార్యాలయంలో తనిఖీ నిమిత్తం కా కినాడ సిటీ అసెంబ్లీ నియోజకవర్గ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి కె.చల్లన్నదొర, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గోవిందు, సచివా లయ వెల్ఫేర్ సెక్రటరీ, వీఆర్వో, మహిళా పోలీస్ తదితర సిబ్బంది వచ్చారు. జిల్లా టీడీపీ కార్యాలయానికి తాళాలు వేసి ఉండడంతో స్టేట్‌మెంట్ రికార్డు చేసుకునేందుకు టీడీపీ నాయకులకు కబురు పంపారు. దీంతో జిల్లా టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు గదుల సాయిబాబు, కాకినాడ సిటీ టీడీపీ ప్రధాన కార్యదర్శి తుమ్మల రమేష్ కార్యాలయం వద్దకు చేరుకుని అధికారులతో మాట్లాడారు. పార్టీ కార్యాలయంలో 500 మంది పట్టే హాల్ ఉందా లేదా అనేది తనిఖీ చేస్తామని అధికారులు చెప్పారు. పార్టీ నాయకులు సాయిబాబు, రమేష్ మాట్లాడుతూ 19 నియోజకవర్గాలకు సంబంధించిన ఉమ్మడి జిల్లా పార్టీ కార్యాలయమని, ఎన్నికల ప్రచార కార్యాలయం కాదని తెలిపారు. కార్యాల యం తనిఖీ చేయాలన్నా, స్టేట్‌మెంట్ రికార్డు చేసుకోవాలన్నా లిఖిత పూర్వకంగా నోటీసు ఇస్తే దానిపై తాము సమాధానం పంపుతామని తెలిపారు. దీంతో రెవెన్యూ అధికారులు వెళ్లిపోయారు.

'వైసీపీని తరిమికొట్టడానికి ప్రజలు సిద్ధం'

కాకినాడ సిటీ, ఏప్రిల్ 8: ప్రశాంత వాతావరణం గల నగరంగా పేరు గాంచిన కాకినాడను ఐదేళ్లలో డ్రగ్స్ గంజాయి, రౌడీలు, గూండాలు, బెట్టింగ్ ముఠాలకు అడ్డాగా మార్చివేశారని, వైసీపీ అరాచక పాలనను తరిమికొట్టడానికి నగర ప్రజలు సిద్ధంగా ఉన్నారని కాకినాడ సిటీ నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి వనమాడి కొండబాబు అన్నారు. 34వ డివిజన్ బ్యాంక్‌పేటలో సోమవారం ఆయన టీడీపీ శ్రేణులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ కూటమి అందించే సంక్షేమ పాలన, సంక్షేమ పథకాలతోపాటు నగరానికి చేపట్టే అభివృద్ధిని వివరిస్తూ సూపర్‌సిక్స్ పథకాల మేనిఫెస్టో కరపత్రాలను ప్రజలకు అందజేశారు. నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, డివిజన్ నాయకులు పొంగా బుజ్జి, బంగారు సత్యనారాయణ, బోను శ్రీను, ఆలీషా, నక్కా సూరిబాబు, గబ్బర్‌సింగ్, బచ్చు కృష్ణ, చింతకాయల చిన్ని, పులపకూర శ్రీనివాస్ పాల్గొన్నారు. సినిమారోడ్‌లోని మస్జీద్-ఏ-అక్షా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో కొండబాబు పాల్గొని ప్రార్థనలు చేశారు.

'ఓటుతో తగిన బుద్ధి చెప్పాలి'

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 8: సీఎం జగన్ రాక్షస పాలన అంతం కోసం త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఓటనే వజ్రాయుధంతో తగిన బుద్ధి చెప్పాలని కాకినాడ రూరల్ జనసేన-టీడీపీ ఉమ్మడి అభ్యర్థి పంతం నానాజీ, టీడీపీ కో కోఆర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్ (బాబీ) కోరారు. సోమవారం 47వ డివిజన్ అశోక్‌నగర్ ప్రాంతంలో ఇంటింట ప్రచారం నిర్వహించి మేనిఫెస్టోపై అవగాహన కల్పించి, గాజు గ్లాసు గుర్తుపై ఓట్లేసి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి పాలన కోసం టీడీపీ-జనసేన,బీజేపీ కూటమి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి ఏసుదాసు, మాజీ జడ్పీటీసీ సభ్యులు నులుకుర్తి వెంకటేశ్వరరావు, పార్టీ రాష్ట్ర ఆరోగ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, చిక్కాల ప్రసాద్, ఇంటి రాజేష్ పాల్గొన్నారు.

'అధికారులపై చర్యలు తీసుకోవాలి'

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 8: కాకినాడ రూరల్ వాకలపూడి ఏడీబీ రోడ్డు పక్కన ఉన్న వాటర్ సర్వీసింగ్ సెంటర్‌పై కోర్టు పరిధిలో ఉందని, స్టే ఆర్డర్ ఉన్న స్థలంలో సర్వే నిర్వహించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని శెట్టి వరలక్ష్మి డిమాండ్ చేశారు. సూర్యారావుపేటకు చెందిన తనకు ఏడీబీ రోడ్డు పక్క సర్వే నెంబర్ 80/88 రోడ్డు పక్కన 30 ఏళ్ల నుంచి సర్వీసింగ్ నిర్వహించుకుంటూ జీవనోపాధి పొందుతున్నట్లు తెలిపారు. తన భర్త రాము జనసేన పార్టీలోకి వెళ్లాడనే రాజకీయకక్షతో తన సర్వీసింగ్ సెంటర్ తొలగించేందుకు అధికార వైసీపీ నాయకుల ప్రోద్బలంతో స్థలాన్ని ఖాళీ చేయించేందుకు ప్రయత్నించడంతో కోర్టుకు వెళ్లగా ఈనెల 3న కోర్టు స్టే ఇచ్చిందన్నారు. కోర్టు ఆదేశాలను ధిక్కరిస్తూ రెవెన్యూ, పంచాయతీ అధికారులు సోమవారం సర్వీసింగ్ సెంటర్‌లో సర్వే నిర్వహించారన్నారు. ఇందుకు బాధ్యులుగా ఉన్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేశారు.

పిఠాపురంలో ఫ్లయింగ్‌స్క్వాడ్‌ల పెంపు

పిఠాపురం, ఏప్రిల్ 8: అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నియోజకవర్గంలో ఫ్లయింగ్‌స్క్వాడ్‌ల సంఖ్యను పెంచారు. ప్రస్తుతం 6 ఫ్లయింగ్‌స్క్వాడ్‌లు ఉన్నాయి. దీంతో వారు 12గంటలు వంతున పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. మిగిలిన నియోజకవర్గాల్లో 8 గంటల వంతున విధులు నిర్వర్తించేలా ఫ్లయింగ్‌స్క్వాడ్‌లను నియమించారు. ఈ నేపథ్యంలో మరో 3 ఫ్లయింగ్‌స్క్వాడ్‌లను నియమిస్తూ రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టరు రామసుందరరెడ్డి ఆదేశాలు జారీ చేశారు. పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల సివిక్స్ లెక్చరర్ ఎం.సుందరయ్యను గొల్లప్రోలుకు, ఎస్వీ వినోద్‌కుమార్‌ను పిఠాపురం, వి.రాజేంద్రప్రసాద్‌లను కొత్తపల్లి మండలాల స్క్వాడ్‌ల ఇన్‌చార్జిలుగా నియమించారు.

టీడీపీలో పలువురి చేరిక

సామర్లకోట, ఏప్రిల్ 8: తెలుగుదేశం పార్టీలోకి సామర్లకోటకి చెందిన పలువురు కార్యకర్తలు చేరారు. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తనయుడు, నిమ్మకాయల రంగనాగ్, పట్టణ టీడీపీ కమిటీ నాయకుల ఆధ్వర్యంలో రాత్రి జరిగిన ఈ కార్యక్రమంలో గాంధీబొమ్మ సెంటర్‌కు చెందిన గండి సుబ్బలక్ష్మి, గండి ప్రసాద్, గండి సూరిబాబు, గండి సూర్యనారాయణలకు ఎమ్మెల్యే చినరాజప్ప పార్టీ కండువాలు కప్పి అభినందించారు. అలాగే 19,24 వార్డులకు చెందిన శిరాట్ల ప్రసాద్, రుద్రయ్య చౌదరిలు టీడీపీలోకి చేరగా వారిని రాజప్ప సాదరంగా ఆహ్వానించారు. పట్టణంలో గోలివారి వీధిలో నివశించే సుమారు 120 కుటుంబాలకు చెందిన జైనులు టీడీపీకి మద్దతు పలుకుతూ రాజప్పను పూలమాలలతో ముంచెత్తారు. పెద్దఎత్తున జైనులు పాల్గొన్నారు.

బీజేపీలో దళితుల చేరిక

ప్రత్తిపాడు, ఏప్రిల్ 8: ప్రత్తిపాడు ఇందిరా కాలనీ దళితవాడలో 150 మంది దళితులు సోమవారం బీజేపీ నేత ఉమ్మడి వెంకట్రావు ఆధ్వర్యంలో బీజేపీలోకి చేరగా జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో దాసరి సత్తిబాబు, చక్రం తదితరులుండగా బీజేపీ జాతీయ కౌన్సిల్ మెంబర్ సింగిలిదేవ్ సత్తిరాజు, జిల్లా సైనిక సెల్ కన్వీనర్ కర్రి ధర్మరాజు, ఏలేశ్వరం నాయకులు కూరాకుల రాజా, ముళ్ళపూడి గణేష్, డి.చంద్రశేఖర్ ఉన్నారు.

పరదేశమ్మతల్లికి ప్రత్యేక పూజలు

తాళ్లరేవు, ఏప్రిల్ 8: ముమ్మిడివరం ఉమ్మడి కూటమి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబును దీవించమ్మా అంటూ మండలంలోని ఇంజరం గ్రామంలో పరదేశమ్మతల్లికి టీడీపీ నాయకులు సాగి వెంకటసుబ్బరాజు, వేగేశ్న భాస్కరరాజులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. త్వరలో జరగబోవు ఎన్నికల్లో దాట్లకు అత్యధిక మెజారిటీ ఇచ్చి ముమ్మిడివరం నియోజకవర్గ ప్రజలను కాపాడాలని వారు కోరారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు రేలంగి శ్రీకాంత్, ఆకెళ్ల నాగేశ్వరరావు, అంజిబాబు పాల్గొన్నారు.

జైజై నారాయణస్వామిని దర్శించుకున్న నల్లమిల్లి

కాకినాడ సిటీ, ఏప్రిల్ 8: పెదపూడి మండలం గొల్లల మామిడాడలో ప్రసిద్ధి చెందిన జైజై నారాయణస్వామి ఆశ్రమంలోని స్వామివారిని సోమవారం అనపర్తి మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి దర్శించుకున్నారు. కోరిన కోర్కెలు తీర్చే స్వామిగా పేరొందిన ఈ ఆశ్రమంలో రామకృష్ణారెడ్డి కొద్దిసేపు గడిపారు. ఆయన వెంట గొల్లల మామిడాడ గ్రామ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

తాగునీరు అందించలేని వైసీపీ ప్రభుత్వం

టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వర్మ

గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 8: ప్రజలకు కనీసం తాగునీరందించలేని దుస్థితిలో వైసీపీ ప్రభుత్వం ఉందని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ విమర్శించారు. పిఠాపురం అసెంబ్లీ నుంచి పోటీ చేస్తున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు మద్దతుగా గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామంలో ఆయన సోమవారం సాయంత్రం ప్రచారం నిర్వహించారు. ప్రధాన కూడళ్లలో ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ 2నెలలు నుంచి బోరు మరమ్మతులకు గురైనా వాటికి రిపేర్లు నిర్వహించడంతో ఎంపీ గీత విఫలమయ్యారన్నారు. బొగ్గు డంపింగ్‌యార్డు తీసుకువచ్చి రైతుల నోట్లో మట్టి కొట్టాలని, గ్రామాన్ని కాలుష్య కోరల్లో పడేయాలని చూస్తే తాము ఉద్యమం నిర్వహించి అడ్డుకున్నామని తెలిపారు. ఐదేళ్ల తర్వాత నేడు ఓట్లు కోసం గీత ప్రజలు ముందుకు వస్తున్నారన్నారు. ఏనాడు ప్రజల కష్టాలను పట్టించుకోని ఆమెను నిలదీయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు ఉలవకాయల దేవేంద్రుడు, మాజీ జడ్పీటీసీ మడికి ప్రసాద్, తూము బాబు, లక్ష్మీపతి, కొమ్మూరు కృష్ణ, బాస్కర్, జనసేన మండలశాఖ అధ్యక్షుడు అమరాది వల్లీ రామకృష్ణ, గంగ తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం: పట్టణంలోని 10,11 వార్డుల్లో జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు మద్దతుగా టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ సోమవారం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ ఫ్లోర్ లీడర్ అల్లవరపు నగేష్, పిల్లి చిన్నా, బర్ల అప్పారావు, కొరుప్రోలు శ్రీను, జనసేన,బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కరప, ఏప్రిల్ 8: మండలంలోని పలు గ్రామాలకు బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ కాకినాడ డివిజన్ ఈఈ జి.ప్రసాద్ తెలిపారు. జగనన్న హౌసింగ్ కాలనీలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం జరుగుతోందని, దీనికి కొత్త లైన్ ఏర్పాటు చేస్తున్న కారణంగా కరప సబ్‌స్టేషన్ పరిధిలోని కరప, పేపకాయలపాలెం, వలసపాకల, వేములవాడ, వాకాడ, పెదకొత్తూరు, చినకొత్తూరు, కొరుపల్లి, జడ్.బావారం, గొడ్డటిపాలెం, అరట్లకట్ట, పెనుగుదురు గ్రామాలకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు సరఫరాను నిలిపివేస్తున్నామని తెలిపారు.

ప్రభుత్వ మద్యం షాపుల నిర్వహణలో నిర్లక్ష్యం

గాలికొదిలేసిన ఎక్సైజ్‌శాఖాధికారులు

కరప, ఏప్రిల్ 8: ప్రభుత్వ మద్యం షాపుల నిర్వహణలో ఎక్సైజ్‌శాఖాధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. నిబంధనలను ఉల్లంఘించి మద్యం షాపులను నడుపుతున్నా పట్టించుకునే నాధుడే కరువయ్యాడు. సుమారు 2 నెలలుగా మద్యం షాపుల్లోని ఫ్రిజ్‌లు పోయినా నేటికీ వాటిని మార్చలేదు. దీంతో చల్లని బీర్లు దొరక్క మందుబాబులు గగ్గోలు పెడుతున్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాకా నిఖార్సైన సరుకు తాగలేకపోయామని, నడ్డివిరుస్తున్న రేట్లు, నాసిరకం మద్యంతో ఇటు ఆర్థికంగాను, అటు ఆరోగ్యపరంగాను దెబ్బతిన్నామని ఆక్రోశం వ్యక్తం చేస్తున్నారు. కాగా మద్యంషాపుల్లో కూలింగ్ బీర్లు దొరకని వైనంపై ఎక్సైజ్‌శాఖ డీఎం ప్రసాద్‌ను వివరణ కోరగా పలు షాపుల్లో ఫ్రిజ్‌లు రిపేరుకు వచ్చి మూలకు చేరాయన్నారు. కొన్నిచోట్ల రిపేర్లు చేయించి వినియోగంలోకి తీసుకువచ్చామని, మరికొన్ని షాపులకు కొత్తవాటిని సమకూర్చే పనిలో ఉన్నామన్నారు. వారంరోజుల్లో కొత్త ఫ్రిజ్‌లను అమర్చి వినియోగంలోకి తీసుకువస్తామన్నారు.

14న జనచైతన్య యాత్ర

జగ్గంపేట, ఏప్రిల్ 8: రైతు కూలీ సంఘం, కార్మిక సంఘాల సమాఖ్య, ప్రగతిశీల మహిళా సంఘం, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నెల్లూరు నుంచి శ్రీకాకుళం వరకు జరిగే జనచైతన్య యాత్రను విజయవంతం చేయాలని రైతు కూలీ సంఘం నేత కర్నాకుల వీరాంజనేయులు విజ్ఞప్తి చేశారు. రంగవల్లి నగర్‌లోని ఈ యాత్రకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన సోమవారం ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ నెల్లూరు జిల్లా తానంచర్ల గ్రామంలో ఏప్రిల్ 14న ప్రారంభమయ్యే ఈ యాత్ర వచ్చే నెల 5న శ్రీకాకుళం జిల్లా బొడ్డ పాడు వద్ద కారల్ మార్క్స్ జయంతి రోజున ముగుస్తుందన్నారు. కార్యక్రమంలో నేతలు వల్లూరి రాజబాబు, కడితి సతీష్, కుంచె అంజిబాబు, డాన్ శ్రీను పలువురున్నారు.

'ఎన్నికల నిర్వహణకు సహకరించాలి'

కాకినాడ క్రైం, ఏప్రిల్ 8: ప్రశాంత వాతావరణంలో రాబోయే సార్వత్రిక ఎన్నికలు నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని ఎస్పీ సతీష్‌కుమార్ కోరారు. ఎన్నికల బందోబస్తులో భాగంగా కాకినాడ రూరల్ మండలం ఇంద్రపాలెం, రేపూరు, గంగనాపల్లి, గొల్లపాలెం, కాజులూరు గ్రామాల్లో కాకినాడ రూరల్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎన్నికల నిర్వహణపై కేంద్ర సాయుధ బలగాలతో సోమవారం కవాతు నిర్వహించారు. పెద్దాపురం ఎస్‌డీపీవో కె.లతాకుమారి ఆదేశాల మేరకు సామర్లకోట ఎస్ఐ మౌనిక ఆధ్వర్యంలో పెద్దబ్రహ్మదేవంలో అవగాహన సదస్సు జరిగింది.

ఆస్తిపన్నుపై ఐదుశాతం రిబేటు

కార్పొరేషన్(కాకినాడ), ఏప్రిల్ 8: 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్నును ఏకమొత్తంగా చెల్లించిన వారికి ఐదుశాతం రాయితీ కల్పిస్తూ పురపరిపాలనశాఖ ఉత్తర్వులు జారీ చేసిందని నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు తెలిపారు. ఏప్రిల్ 30లోపు పన్ను చెల్లించే వారికి ఈ రాయితీ వర్తిస్తుందన్నారు. పన్ను బకాయిలో ఐదుశాతం తగ్గించి చెల్లించవచ్చున్నారు. అన్ని సచివాలయాల్లో, నగరపాలక సంస్థ కార్యాలయంలోను పన్ను చెల్లించవచ్చని ఆయన చెప్పారు.

చర్చిస్ ఇన్ తెలుగు స్టేట్స్ పుస్తకావిష్కరణ

కార్పొరేషన్ (కాకినాడ), ఏప్రిల్ 8: ఉభయ తెలుగు రాష్ట్రాల్లో చరిత్ర కలిగిన చర్చిలకు సంబంధించి వివరాలను తెలిపేలా రచించిన చర్చిస్ ఇన్ తెలుగు స్టేట్స్ పుస్తకాన్ని ఆవిష్కరించినట్లు పుస్తక రచయిత సునాత్‌కుమార్ తెలిపారు. కాకినాడ రోటరీక్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో శామ్‌బిన్నీ, రంజిత్, రిక్కీగూటం, వరప్రసాద్, పున్నయ్య, సత్యమూర్తి, వెంకటరత్నం పాల్గొన్నారు.

ఉగాదికి ఆలయాల ముస్తాబు

పిఠాపురం, ఏప్రిల్ 8: ఉగాది వేడుకలకు పిఠాపురం నియోజకవర్గంలోని ఆలయాలు ముస్తాబవుతున్నాయి. మంగళవారం పంచాంగశ్రవణాలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పిఠాపురం పాదగయ క్షేత్రంలో పంచాంగశ్రవణంతో పాటు కుక్కుటేశ్వరస్వామి, రాజరాజేశ్వరీదేవి, దత్తాత్రేయస్వామి, పురుహుతికాఅమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరగనున్నాయి. ఇక్కడే పంచాంగశ్రవణం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఈవో, సహాయ కమిషనరు పులి నారాయణమూర్తి తెలిపారు.

సామర్లకోట: కుమార రామ భీమేశ్వరాలయంలో మంగళవారం నుంచి ఈనెల 17 వరకూ వసంతనవరాత్ర మహోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో బళ్ళ నీలకంఠం వెల్లడించారు. మంగళవారం ఉదయం విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, కలశ స్థాపన,పంచాంగ శ్రవణంతో వసంత నవరాత్ర ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

జోరుగా వస్తువుల అమ్మకాలు

పోర్టుసిటీ(కాకినాడ): ఉగాది సందర్భంగా వేపపచ్చడికి ఉపయోగించే అరటిపళ్లు, వేప పువ్వు, కొబ్బరికాయలు, మామిడికాయలు, బెల్లం, చింత పండు, చెరుకుగడలు, గుల్ల శనగపప్పు తదితర వస్తువుల అమ్మకాలు జోరుగా సాగాయి. నగరంలోని మెయిన్‌రోడ్, భానుగుడి, జగన్నాథపురం వంతెన, గాంధీనగర్, ఆర్టీసీ బస్టాండ్, రైతుబజార్ తదితర ప్రాంతాల్లో వ్యాపారులు అమ్మకాలు నిర్వహించారు.

నేత్రదానం

తాళ్లరేవు, ఏప్రిల్ 8: జార్జీపేటకు చెందిన నందెపు సీతారత్నం, పి.మల్లవరానికి చెందిన ధూళిపూడి నాగేశ్వరరావు సోమవారం మరణించారు. వారి నేత్రాలను కుటుంబ సభ్యుల అంగీకారంతో సామాజిక కార్యకర్త ధూళిపూడి వెంకటరమణ ఆధ్వర్యంలో కాకినాడ బాదం బాలకృష్ణ ఐబ్యాంక్‌కు దానం చేశారు. కార్నియాలతో నలుగురుకి కంటిచూపు కల్పించారు. దాత కుటుంబాలను పలువురు అభినందించారు.